# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్ లను మరింతగా ప్రోత్సహించనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలియజేశారు.

- ❖ నేరాల నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాల్సి ఉందని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.

- ❖ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ జనరంజకమైనదని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.

- ❖ రాష్ట్ర వ్యాప్తంగా "స్వచ్ఛాంధ్ర... స్వచ్ఛ దివస్.." కార్యక్రమాన్ని ఈరోజు ఘనంగా నిర్వహించారు.

========================

రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలను తగ్గించేందుకు సౌర, పవన విద్యుత్ ను మరింతగా తీసుకువస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరులో ఈరోజు జరిగిన "స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర.." కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ... ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద ఇంటి వద్దనే విద్యుత్ ను ఉత్పత్తి చేసుకోవచ్చని చెప్పారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి ప్రతి ఇంటి నుంచి సహకారం అవసరమని, రాష్ట్రంలోని వివిధ పట్టణాల్లో పేరుకుపోయిన 85 లక్షల టన్నుల చెత్తను అక్టోబర్‌లోగా తొలగిస్తామన్నారు. నెల్లూరు.. రాజమహేంద్రవరంలలో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గతంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని తీసుకువచ్చామని.. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కు ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు.

========================

విజయవాడ ప్రాసిక్యూషన్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... న్యాయవాదులందరినీ ఒక చోట చేర్చి సదస్సు నిర్వహించడం సంతోషకరమని, న్యాయవిచారణ వేగంగా పూర్తి చేసేందుకు ఈరోజు తొలి అడుగు పడిందని అన్నారు. న్యాయవ్యవస్థల్లో మహిళలు ఎక్కువ ఉండడం శుభపరిణామమని చెప్పారు. పోలీస్, లాయర్ వృత్తిలోకి రావడం గొప్ప విషయమని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని, నేరస్థులను పట్టుకోవడానికి సాంకేతికంగా

మరింత పురోగమించాలని అన్నారు. సాంకేతికతను ఉపయోగించుకుని నేరాలను నియంత్రించాల్సిన అవసరం ఏర్పడిందని హోంమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

=======================

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజారంజకమైనదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. అనంతపురంలోని ఆర్ అండ్ బి వసతి గృహంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... అన్ని వర్గాల వారికి మేలు చేసే విధంగా కేంద్ర బడ్జెట్‌ను రూపొందించారని, భారతదేశం అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ముఖ్యంగా వ్యవసాయం, MSME, మౌలిక సదుపాయాల కల్పన, ఎగుమతులు లాంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి బడ్జెట్ తయారు చేయడం జరిగిందన్నారు. వ్యవసాయానికి పెద్దపీట వేశారని, క్యాన్సర్ మందులపై GST తగ్గింపు, ప్రభుత్వ పాఠశాలల్లో 50 వేల ల్యాబ్ ల ఏర్పాటు చేయడం కీలకమైన అంశాలని మంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 29 సెకన్లు)

=======================

రాష్ట్ర రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నమయ్య జిల్లా నల్లగుట్టపల్లిలో నూతనంగా నిర్మించిన ఇంకుడు గుంతను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వర్షపు నీరు వృధాగా పోకుండా ప్రతి నీటి బొట్టును భూమిలోకి ఇంకిపోయేలా చేసేందుకు, తద్వారా భూగర్భ జలాల సంరక్షణకు ఇంకుడు గుంతలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసర ప్రాంతాలలో ఇంకుడు గుంతలు నిర్మించి భూగర్భ జలాలను పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు.

=======================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కండి మినరల్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దూబగుంట గ్రామంలో 45 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన వ్యర్థాలను శుభ్రపరిచే యంత్రం (MRFC) ను ప్రారంభించారు. యంత్ర పని తీరును నిశితంగా పరిశీలించి సిబ్బంది నుండి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ, పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా దూబగుంట గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పరిశీలించారు.

విరామం

=======================

అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవాన్ని ఈరోజు విజయవాడలో ఘనంగా నిర్వహించారు. కస్టమ్స్ కమిషనరేట్ (ప్రివెంటివ్), విజయవాడ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో "సమర్థత, భద్రత, సంపదను అందించడంలో కస్టమ్స్ నిబద్ధత" అనే వార్షిక ఇతివృత్తానికి అనుగుణంగా, ఆర్థిక భద్రతలో కస్టమ్స్ ప్రాముఖ్యత, అంతర్జాతీయంగా వాణిజ్యాన్ని సులభతరం చేసే విధానాలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చీఫ్ కమిషనర్ ఆఫ్ ఇన్ కమ్ టాక్స్.. వరిందర్ మెహతా, గౌరవ అతిథిగా విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ. పాటిల్ హాజరయ్యారు. కాగా... ఈ ఆర్థిక సంవత్సరం జనవరి నెల వరకు విజయవాడ కస్టమ్స్ కమిషనరేట్ (ప్రివెంటివ్) ద్వారా 11 వేల 480 కోట్ల రూపాయల ఆదాయం సమకూరింది. థాలసీమియా రోగుల చికిత్స కోసం 52 రక్తదాన శిబిరాలు నిర్వహించి, 4 వేల 59 యూనిట్ల రక్తాన్ని విజయవాడ కస్టమ్స్ కమిషనరేట్ వారు సేకరించారు.

========================

నీటిపారుదల విభాగంలో చేపట్టిన అత్యవసర పనులను వచ్చే నెలాఖరు లోగా పూర్తి చేయనున్నామని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం మొగల్తూరులో మురుగు నీటి కాల్వల్లో మట్టి తొలగింపు పనులను మంత్రి ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇరిగేషన్ విభాగంలో అత్యవసర పనుల కోసం 320 కోట్ల రూపాయలు కేటాయించామని తెలిపారు. ఇరిగేషన్ వ్యవస్థకు అధిక ప్రాధాన్యతనిస్తూ.. రైతులను భాగస్వామ్యం చేసేలా సాగునీటి సంఘాల ఎన్నికలు జరిపామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 24 సెకన్లు)

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం నెలవారీ లక్ష్యాలతో ముందుకు వెళుతున్నామని, వచ్చే సీజన్ నాటికి లెఫ్ట్ కెనాల్ పనులు పూర్తి చేసి, గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తరలిస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు.

========================

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదామని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా ఈరోజు పార్వతీపురం మండలం పెదబొండపల్లి, దిబ్బగుడివలస గ్రామాల్లో చేపట్టిన పారిశుద్ధ్య, ఉపాధి హామీ కార్యక్రమాలను ఆయన పరిశీలించారు.

ప్లాస్టిక్ ను నిర్మూలిద్దాం క్యాన్సర్ ను జయిద్దాం అంటూ పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. భీమవరంలో "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సోర్స్ - రిసోర్స్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... భీమవరం పరిసర గ్రామాలలో ప్లాస్టిక్ వ్యర్థాలు నిండిపోయాయని, దీని కారణంగా గాలి, నీరు, భూమి అన్ని కలుషితమై ప్రజలు, జంతువులు అనారోగ్యాల పాలు కావడం జరుగుతోందని చెప్పారు.

స్వచ్ఛాంధ్ర ద్వారానే స్వర్ణాంధ్ర లక్ష్యం సాకారమవుతుందని ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ అన్నారు. స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర.. కార్యక్రమంలో భాగంగా ఒంగోలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు.

========================

పోలవరం ప్రాజెక్టు ముంపు బాధిత కుటుంబాలను.. నూతనంగా నిర్మించిన కాలనీలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈరోజు ఆయన దృశ్య మాధ్యమం ద్వారా పోలవరం ప్రాజెక్ట్ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ కి సంబంధించిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేయడం జరుగుతుందన్నారు. రంపచోడవరం డివిజన్‌లో 2, చింతూరు డివిజన్ లో 4 ఆర్ అండ్ ఆర్ కాలనీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

========================
========================